www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 21 మార్చి 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





## మద్యం గోడౌన్‌లో కలెక్టర్ తనిఖీ



**ప్రజాశక్తి-నెల్లూరు** సార్వత్రిక ఎన్నికల నిర్వహణ నేపథ్యంలోఎన్నికల మార్గదర్శకాల ప్రకారం మద్యం గోడౌన్, తయారీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరి నారాయణన్ తనిఖీ చేశారు. బుధవారం నెల్లూరు రూరల్ మండల పరిధిలోని దేవరపాలెం వద్ద వద్దనున్న రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ మద్యం గోడౌన్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. గోడౌన్ లోని రోజువారీ మద్యం ఓపెనింగ్ స్టాక్, క్లోజింగ్ స్టాక్ వివరాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిపో మేనేజర్ నాగ మల్లేశ్వర రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. వాహనాల రాకపోకల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు. గోడౌన్ లో మద్యం నిల్వలను తనిఖీ చేశారు. సర్వేపల్లి లోని ఎస్ ఎన్ జె డిస్టిలరీ మద్యం తయారీ కేంద్రాన్ని పరిశీలించి, పలు రికార్డులను తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగ మల్లేశ్వర్ రెడ్డి, సిబ్బంది శీను బాబు, రేఖ, గౌరీ, ఎస్సై పివి శేషయ్య, అసిస్టెంట్ మేనేజర్ విజయ్ కుమార్,సూపర్వైజర్ రామారావు ఉన్నారు.

# అభ్యర్థుల్లో ఎన్నికల వణుకు..!

**పార్టీ తరపున టికెట్ వస్తే చాలని భావించిన అభ్యర్థులకు ఇప్పుడు ఎన్నికల షెడ్యూల్ చూసిన తర్వాత వణుకు పుడుతోంది. దేశవ్యాప్తంగా జరుగుతోన్న సార్వత్రిక ఎన్నికల్లో నాలుగో విడత ఎన్నికలు జరగనున్నాయి. తొలిసారిగా 58 రోజులు ఎన్నికల నిర్వహణ సాగనుంది. ఇప్పటికే అభ్యర్థులు కార్యక్రమాల పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఇక పై భారీగా ఖర్చులు చేయడంతోపాటు, ప్రభుత్వానికి లెక్కలు చూపించాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఎంపి రూ.95 లక్షలు, ఎంఎల్ఎ అభ్యర్థి రూ.40 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రతి రోజు లక్షల రూపాయలు వైసిపి, టిడిపిలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మరో వైపు ఎన్నికల అధికారులు నిఘా ఉదుగుతుంది. జనం తరలింపు, భోజనాలు, రవాణా, సభల నిర్వహణ లెక్కలు బయటకు తీస్తున్నారు. ఓ వైపు క్యాడర్ కోసం ఖర్చు చేయాల్సి ఉండగా, మరో వైపు ప్రభుత్వానికి లెక్కలు చూపించాల్సి రావడంతో అభ్యర్థులు వణుకుతున్నారు..**

**-57 రోజులు నిర్వహణ**
**-ఇప్పటికే నెల రోజుల నుంచి ఖర్చులు**
**-ఆర్భాటంగా ప్రచారం ప్రారంభం**

**ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి** రాజకీయాలు రోజు రోజుకు ఖరీదవుతున్నాయి. ఒకప్పుడు ప్రజల కోసం త్యాగాలు చేసిన నేతలు ఎన్నికల్లో పోటీచేసేవారు. ఇప్పుడు ఆర్థిక, అంగ బలం ఉన్న నేతలు ఎన్నికల బరిలో దిగుతున్నారు. టిడిపి, వైసిపిలు అభ్యర్థులకు టికెట్లు కేటాయించాలంటేనే కోట్ల రూపాయలు చూపించాల్సిన పరిస్థితులున్నాయి. ఎన్నికల ఖర్చులు షరా మామూలే. టికెట్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టిన రోజు నుంచి వైసిపి, టిడిపి అభ్యర్థులు రోజు లక్షల రూపాయలు ఖర్చుచేస్తున్నారు. ప్రచారం. రవాణా, ఉదయం టిఫిన్, భోజనాలు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. నేతలు, కార్యకర్తలను ఉత్సాహ పరచడానికి కష్టపడుతున్నారు. ఎన్నికలు సాధాంణంగా నెలరోజుల్లోనే ముగుస్తాయి., ఈ ధఫా రాష్ట్రంలో నాలుగో విడత పోలింగ్ జరుగుతుండడంతో 58 రోజులు నిర్వహణ సాగనుంది. భారీ దూరంలో ఎన్నికలు ఉండడంతో నిర్వహణ తలకు మించిన భారంగా ఉండబోతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గతంలో ఎంపి అభ్యర్థి ఎన్నికల్లో రూ.70 లక్షలు ఖర్చు చేయాల్సి ఉండగా, దానిని ప్రస్తుతం రూ.95 లక్షలకు పెంచారు. ఎంఎల్ఎ అభ్యర్థి గతంలో రూ.28 లక్షలు ఖర్చుచేయాల్సి ఉండగా, ప్రస్తుతం దానిని రూ.40 లక్షలకు పెంచారు. ఓవైపు ప్రభుత్వ నిబంధనల మేరకు ఖర్చుచేయాల్సి ఉండగా, నేతలు, కార్యకర్తలను సంతృప్తి పరచడానికి భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందోనని భయం అందరి అభ్యర్థుల్లో నెలకొంది. ప్రతి రోజూ ఖర్చుల వివరాలను అధికారులకు అందించాల్సి ఉంటుంది. ప్రచారంలో ఉపయోగించే ప్రతి వస్తువుకూ లెక్కలు వేయనున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతోంది. ఏప్రిల్ 25 నామినేషన్ ప్రక్రియ ముగుస్తుంది. ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూటినీ, నామినేషన్ల విత్ డ్రాకు ఏప్రిల్ 29 చివరి తేది. మే 13న రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ ముగుస్తుంది. జూన్ 6 తో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. జిల్లాలోని నెల్లూరు పార్లమెంట్‌కు హేమా హేమీలు పోటీపడుతున్నారు. టిడిపి నుంచి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైసిపి నుంచి విజయసాయిరెడ్డి పోటీ చేస్తున్నారు. ఎన్ని కోట్లు ఖర్చు చేస్తారో లెక్కలేనంత ఉంది. అసెంబ్లీ నియోజకవర్గాల్లో నెల్లూరు రూరల్, కోవూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి లోనూ పోటా పోటీ నెలకొనడంతోపాటు భారీగా ఖర్చు చేయనున్నారు. బుధవారం నుంచి జిల్లా వ్యాపితంగా ప్రచార సభలు నిర్వహిస్తున్నారు. అక్కడకొచ్చే జనం, భోజనాలు, వాహనాలు, అన్నింటా ప్రభుత్వం నిఘా పెట్టింది. జిల్లాల్లో ఖర్చులు ఎక్కువ చేసే అభ్యర్థులకు అనర్హత వేటు వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. టికెట్ కోసం పోటీ పడ్డ నేతలు, ఇప్పుడు ఇన్ని రోజులు ఎన్నికల నిర్వహణ విషయంలో అన్ని రాజకీయ పార్టీల నేతలు తర్జన, భర్జన పడుతున్నారు. వేసవి తాపం పెరగడం కూడా కాస్త ఇబ్బందులకు గురిచేసింది.

పార్లమెంట్ నియోజకవర్గానికి సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.25 వేలు, అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు 50 శాతం మినహాయింపు ఉంటుంది. జిల్లాలో 2460 పోలింగ్ కేంద్రాలు,. జిల్లాలో మొత్తం ఓటర్లు 20,39,215 మంది కాగా, పురుషులు 9,97,908 మంది అని, స్త్రీలు 10,41,096, మంది ఒటర్లు ఉన్నారు.



కోవూరులో ప్రచారం ప్రారంభించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి



సర్వేపల్లిలో ప్రచారం ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

# సర్వేపల్లికి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి..?

**-శృతి పోటీకి ఫ్యామిలీ నిరాకరణ**
**-పదిరోజులు తర్జన భర్జన**
**-ఫలించనున్న సోమిరెడ్డి ప్రయత్నం**



సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

సర్వేపల్లి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేరును దాదాపు ఖరారు చేసినట్లు తెలిసింది. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తొలుత సోమిరెడ్డి కోడలు సోమిరెడ్డి శృతికి పోటీ నిలపాలని ప్రయత్నాలు చేశారు. ఇదే విషయాన్ని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి స్పష్టం చేశారు. పది రోజుల నుంచి ఆయన కుటుంబంలో పోటీ విషయంపై చర్చలు సాగుతున్నాయి. ఓ వేళ సోమిరెడ్డి కుటుంబం నుంచి పోటీకి రాకపోతే మరొకరికి అవకాశం కల్పిస్తామని టిడిపి అధిష్టానం చెప్పినట్లు సమాచారం. చివరిగా కుటుంబ బాధ్యతలు, ఇద్దరు పిల్లలు, బెంగుళూరులో నివాసం ఉంటున్న శృతితోపాటు, కుటుంబ సభ్యులు ఆమె పోటీ సుముఖంగాలేదని తెలిసింది. చివరికి తమ కుటుంబం నుంచి ఆడవారు రాజకీయాల్లోకి వచ్చి పోటీ చేయడం కుటుంబం నుంచి చంద్రబాబునాయుడుకు సందేశం పంపినట్లు తెలిసింది. చేసేదేమీ లేక చివరికి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేరునే ఖరారు చేసినట్లు సమాచారం. పది రోజుల నుంచి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనకు అవకాశం ఇవ్వాలని అధినేత చంద్రబాబునాయుడు వద్దకు రాయ బారాలు నడుపుతున్నారు. యువతకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే శృతికి అవకాశం కల్పిస్తామని చెప్పినట్లు తెలిసింది. తనకు అవకాశం ఇస్తే గెలుస్తానని సోమిరెడ్డి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. పార్టీలో సీనియర్‌నేత, కష్టకాలంలో నిలబడ్డనేత టికెట్ కోసం ఎదురు చూడాల్సి రావడంతో టిడిపి నేతలు, కార్యకర్తల్లో అసంతృప్తి చెలరేగింది. పదిరోజుల ఉత్కంఠకు తెరపడనున్నట్లు తెలిసింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో సర్వేపల్లిలో సోమిరెడ్డి కుటుంబానికి మాత్రమే అవకాశం కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు, సోమిరెడ్డి కోడలు పోటీకి కుటుంబం సుముఖంగాలేదు. చివరికి సోమిరెడ్డి చంద్రమో హన్‌రెడ్డి వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. నేడో, రేపో వచ్చే జాబితాలో సోమిరెడ్డి చంద్రమో హన్‌రెడ్డి పేరు ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే సోమిరెడ్డి అభి మానులకు పండగే. ఈ ధఫా ఆయనకు టికెట్ లేదనే ప్రచారానికి తెరపడ నున్నట్లు సమాచారం. ఏం జరుగుతుందో చూడాలి.

## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



**ప్రజాశక్తి-నెల్లూరు** : భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఐదు కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రదేశంలో ఓటరు సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం తోపాటు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారిం చనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ పేర్కొన్నారు. బుధవారం ముత్తు కూరులోని ఈదురు ఈశ్వరమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరి శీలించారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఐదు కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రదేశంలో ఓటరు సహాయ కేంద్రం ( ఓటరు అసిస్టెంట్ బూత్) ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. . దీంతో ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును విని యోగించుకునే అవకాశం కలుగు తుందన్నారు.

**10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు**

ముత్తుకూరులోని ఈదురు ఈశ్వరమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్ పది పోలింగ్ కేంద్రాలు ఉన్న అతిపెద్ద ప్రాంగణమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ తెలిపారు. ఈ హైస్కూల్లో చేపట్టాల్సిన మౌలిక వసతులపై రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసుకు పలు సూచనలు చేశారు. ఓటరు సహాయ కేంద్రం ఏర్పా టుకు చర్యలు చేపట్టాలని, ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టెంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసు, డిటి డానియల్ ఉన్నారు.

## ప్రజా సమస్యలపై
# సిపిఎం విస్తృత ఉద్యమాలు

**ప్రజాశక్తి-నెల్లూరు** :ప్రజా సమస్యలపై సిపిఎం విస్తృత ఉద్యమాలు చేసిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. నగర నియోజకవర్గ పరిధిలోని 53వ డివిజన్‌లో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి పర్యటన కార్యక్రమం చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆధ్వర్యంలో 53వ డివిజన్ శాఖ సభ్యుల సహకారంతో ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మూలం రమేష్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ చేసిన ఉద్యమాలు, సాధించిన విజయాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. వరదలు వచ్చినప్పుడు. కరోనా సమయంలో అనేక కార్యక్రమాలు చేపట్టిన ప్రజలను ఆదుకున్నట్లు తెలిపారు. ఈ కాలనీకి ఆనుకొని ఉన్న పెన్నానదికి రివిట్మెంట్ పనులు పూర్తి చేసి ప్రారంభించాలని ఉద్యమించినట్లు తెలిపారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఉద్యమించినట్లు తెలిపారు. జనార్దన్ రెడ్డి కాలనీ ఉన్న సమస్యలను పరిష్కరిం చాలని, అనేక సమస్యలు పరిష్క రించడంలో పార్టీ ప్రజల వెంట ఉండి సాధించామన్నారు. గతం లో ఇక్కడ కార్పొరేటర్ గా పోటీ చేసిన నన్ను ఈ కాలనీ ప్రజలు 1100 ఓట్ల మెజార్టీతో గెలిపించార ని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజల కోసం కార్మికుల కోసం ప్రజా సమస్యల కోసం నిత్యం పోరాటం చేస్తున్న వామపక్షాలు కాంగ్రెస్ బలపరిచిన సిపిఎం అభ్యర్థికి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు, నరసింహా, రమణ, వేణు, నక్కా వెంకటేశ్వర్లు, బయ్యన్న, సునీల్, రవి ఉన్నారు.



53వ డివిజన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

## 'విఆర్' విద్యా సంస్థలను కొనసాగించాలి

**నెల్లూరు** :ఎంతో పేరు ప్రతిష్ట కలిగిన విఆర్ విద్యాసంస్థలను నగరంలో తిరిగి యథాతథంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు నగర నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పొంగూరు నారాయణకు వినతిపత్రం అందజేశారు. బుధవారం పొంగూరు నారా యణ కార్యాలయంలో ఆయన్ను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.నరేంద్ర, ఎం.శ్రీహర్ష కలిశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ నగరానికి తలమానికమైన వి ఆర్ విద్యా సంస్థలు ప్రస్తుతం మూసివేయడం దారుణ మన్నారు. ఈ విద్యా సంస్థలపై ఇప్పటికే అక్రమార్కుల కన్ను పడటంతో కోట్లాది రూపాయల విలువైన విద్యాసంస్థల భవనాలు ఆలనా,పాలనా లేక శిథిలావ్యవస్థకు చేరుకున్నాయి. ఎందరో మేధావులను,రాజకీయ ఉద్దండులను తయారుచేసిన ఈ విద్యాసంస్థల పరిస్థితి నేడు దయనీయంగా మారిపోవడం భాదాకరమన్నారు. 2019 వ సంవత్సరంలో సుప్రీంకోర్టు ఈ కళాశాల సొసైటీకి ఎన్నికలు జరిపి నూతన కమిటీని ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో అధికార యంత్రాంగం ఈ కళాశాల సొసైటీ కి ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. నామినేషన్లు కూడా స్వీకరించారు. తరువాత ఏమైందో.... ఏమోకానీ ఎన్నికలు అర్థాంతరంగా నిలిచి పోయాయన్నారు. ప్రాంతీయ విద్యా కేంద్రాన్ని (రీజనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్) సెంట్రల్ గవర్నమెంట్ సంస్థకు ఈ విద్యాసంస్థలను తాత్కాలికంగా అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో విద్యాసంస్థల ఆస్తులను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. టిడిపి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఈ సమస్యకు పరిష్కారం చూపించే నిర్ణయాన్ని ప్రకటించాలన్నారు. నగర నాయకులు జీవన్ పాల్గొన్నారు.



మాజీ మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## దంతాల పరిశుభ్రత ముఖ్యం

**నెల్లూరు** :నోటి, దంత పరిశుభ్రత పాటించి ఆరోగ్యకరమైన జీవనం సాగించాలని, ప్రతిరోజు రెండు పర్యాయాలు నోటిని శుభ్రపరుచుకోవాలని ప్రముఖ దంత వైద్య నిపుణురాలు డాక్టర్ మానస తెలిపారు. బుధవారం ప్రపంచ నోటి పరిశుభ్రత దినోత్సవం (వరల్డ్ ఓరల్ హెల్త్ డే) ని పురస్కరించుకొని మానస డెంటల్ కేర్, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డైకస్ రోడ్డు సెంటర్ లోని వియాని హోం నందు ఉచిత దంత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో పాల్గొని, దంత పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మారుతున్న జీవన విధానంలో నోటి, దంత శుభ్రత విస్మరించరాదన్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేవారు. డాక్టర్ మానస ను నిర్వా హకులు ఘనంగా సన్మానించారు. రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, విశ్రాంత ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా, వియాని హోం నిర్వాహకులు సిస్టర్ రమా, జయ, జె. వసుంధరదేవి, పి.హెచ్.పి నాయకులు గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నంద్యాల మాలిని, బషీరు పాల్గొన్నారు.

## ఓటర్లకు అవగాహన

**ప్రజాశక్తి-కందుకూరు**:కందుకూరు నియోజ కవర్గం లో ఓటర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా పర్యావరణం రక్షణకు మొక్కలు నాటుదాం, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వేద్దాం అనే నినాదంతో నియోజకవర్గస్థాయిలో ఓటర్లకు అవ గాహన కార్యక్రమం చేపట్టారు.ఈ ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్-కలెక్టర్ విద్యాధరి మాట్లాడారు.

## ప్రముఖ విద్యావేత్త
# కెవి రత్నం కన్నుమూత

### నేడు అంత్యక్రియలు

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

ప్రముఖ విద్యావేత్త రాష్ట్రంలోనే ప్రయివేటు కోచింగ్ సెంటర్లకు ఆద్యుడు కెవి రత్నం (85) బుధవారం నెల్లూరు నగరంలోని ఆయన నివాసంలో కన్నుమూశారు. కొంత కాలంగా కేన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ కిషోర్ ఇద్దరు విద్యా సంస్థలు నిర్వహిస్తున్నారు. 1986 కాలంలో ఆయన నెల్లూరు నగరంలో రత్నం కోచింగ్ సెంటర్ ప్రారంభించారు. రాష్ట్ర వ్యాపితంగా విద్యార్థులకు ఇక్కడకు వచ్చి పోటీపరీక్షలకు సిద్ధమయ్యే వారు. అటు తరువాత కొద్ది రోజులకు రత్నం విద్యాసంస్థల పేరుతో కాలేజీలు ప్రారంభించారు. రాష్ట్రంలోనే రత్నం విద్యాసంస్థలకు పేరు తీసుకొచ్చారు. ఇంజినీరింగ్, మెడిసిన్ కోచింగ్‌కు రత్నం సంస్థ ప్రత్యేకమైంది. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఎందరో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. డాక్టర్లు, ఇంజినీర్లు, సినీ నటులు, రాజకీయనేతల తోపాటు విదేశాల్లో వంద లాది మంది స్థిరపడ్డారు. చిన్నారి హార్ట్ ఫౌండేషన్ స్థాపించి అనేక మంది చిన్న పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించారు. అనేక సామాజిక సేవా కార్యక్రమా ల్లోనూ ఆయన పాల్గొనేవారు.



కెవి రత్నం(ఫైల్)

**నేడు అంత్యక్రియలు**

కెవిరత్నం అంత్యక్రియలు నేడు మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తారు. ముత్తుకూరు గేట్ వద్ద ఆయన అతిథిగృహం నుంచి అంత్యక్రియలు ప్రారంభమవుతాయి. పిడితాపోలూరు వద్ద ఉన్న ఆయన విద్యా సంస్థలకు దగ్గరలోని ఆయన పొలాల్లో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఆయన భౌతిక కాయాన్ని పలువురు సందర్శించి నివాళి అర్పించారు. ఎంపిలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విజయ సాయిరెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమో హన్‌రెడ్డి, మేయర్ స్రవంతి, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎంఎల్‌సి పి.చంద్రశేఖర్‌రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



రత్నం భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి నారాయణ

## ఎంఎల్‌ఎ 'బుర్రా' పరామర్శ

**ప్రజాశక్తి-కందుకూరు** : గుడ్లూరు మండలానికి చెందిన చెమిడిద పాడు , పొట్లూరి గ్రామాలకు చెందిన వైసిపి కార్యకర్తలు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న వైసిపి కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ చి హుటాహుటిన వారి స్వస్థలాలకు వెళ్ళి పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు వారి కుటుంబాలకు ఆదుకునేందుకు ప్రభుత్వం ద్వారా కషి చేస్తానని హామీ ఇచ్చారు . ముందుగా పోట్లూరు గ్రామం ఎస్టీ కాలనీకి చెందిన పోట్లూరి ముసలయ్య బైక్ ప్రమాదంలో మరణిం చారు. ఆయన మతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన కాపులూరి చిన్న కొండయ్య ఆటో ప్రమాదంలో గాయపడి ఇంటి దగ్గర మంచానికి పరిమితమయ్యారు. వారిని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. చెమిడిద పాడు గ్రామం ఎస్టీ కాలనీకి చెందిన పోట్లూరి శ్రీరాములు ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆయన ఇంటికి బుర్రా మధుసూదన్ యాదవ్ వెళ్లి అండగా ఉంటామని తెలిపారు.



పరామర్శిస్తున్న బుర్రా మధుసూదన్ యాదవ్

## విరాళం అందజేత

**ప్రజాశక్తి-కందుకూరు** : అంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం ఎంఎల్‌ఏ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంతో వైభవంగామొదటి దశ నిర్మాణం పూర్తయింది. అనివేటి మండప నిర్మాణానికి భక్తులు తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు. బుధవారం సాలిపేట గ్రామానికి చెందిన కవర్తపు నవీన్ ధర్మపత్ని కావ్య రూ 25000లు విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావుకు అందజేశారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ అమ్మవారి ఆలయ నిర్మా ణానికి సహకరించిన దాతలకు వారి కుటుంబ సభ్యులకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు.

## హెల్త్ ప్రొవైడర్ల వివరాలు నమోదు తప్పనిసరి

**నెల్లూరు** :ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో హెల్త్‌ప్రొవైడర్ల వివరాలు విధిగా నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ఎం.పెంచలయ్య పిలుపు నిచ్చారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని ప్రయివేటు ఆసుపత్రులు, క్లినిక్స్, లాబ్స్, స్కానింగ్ సెంటర్స్, ఆప్తాల్మిక్, దంత, ఫిజియోథెరఫీ సెంటర్స్ పేర్లతో వైద్యసేవలం దిస్తున్న వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సంబందిత విభాగ అధికారులను సంప్రదించాలన్నారు.

## వైసిపి ప్రచారం

**కందుకూరు** : పట్టణంలోని 3వ సచివాలయం ఉప్పు చెరువులో వైసిపి అభ్యర్ధి బుర్రా మధుసూదన్ యాదవ్ కు మద్దతుగా ప్రచారం చేశారు. పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ జె సి యస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు రాష్ట్ర నాయకులు గణేషం గంగిరెడ్డి జిల్లా నాయకులు డిసిహెచ్ మాలకొండయ్య రేణమాల అయ్యన్న, సచివాలయం కన్వీనర్ పెయ్యల వెంకట రమణయ్య యాదవ్ తలారి ప్రసన్న కుమారి పి. పరిశుద్ధరావు, నగళ్ళ నారయ్య షేక్ మస్తాన్ వలీ జి. మాధవ రెడ్డి, సంఘా నరశింహం, షేక్ బికారి బిరుదుల సంధ్యారాణి కామాక్షి నాయుడు ఉచ్చులూరి రవీంద్ర సూరపోగు రాజశేఖర్ ఈశ్వరమ్మ నాగూర్ యడ్ల మాధవరెడ్డి చుండి ఈశ్వర రావు శ్రీను యన్ శ్రీకాంత్ ఉన్నారు.

## కరపత్రాలు పంపిణీ

**ప్రజాశక్తి-కందుకూరు**


పట్టణంలోని 21వ వార్డు పడమటి మంగళ పాలెం ప్రాంతాలలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా కందుకూరు నియోజకవర్గ టిడిపి అభ్యరిథ ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. వైసీపీ నేతలు కక్షగట్టి పింఛన్లు తీసివేశారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పాకల మల్లికార్జున, పట్టణ మహిళా అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, వార్డు మహిళలు నాదెండ్ల సబ్బులు, నాదెండ్ల లక్ష్మీరాజ్యం, పాకల రమాదేవి, భాగ్యలక్ష్మి పట్టణ మహిళా నాయకులు వార్డు నాయకులు రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధుబాబు, సంగా పాండురంగారావు, స్వర్ణ సుబ్బారావు, స్వర్ణ నాగరాజు, స్వర్ణ తిరుమలరావు, నాదెండ్ల శ్రీనివాసులు, పేర్లమిట్ట శ్రీనివాసులు, నాదెండ్ల మధు, పథకమూరి వరప్రసాదరావు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఇంటూరి సౌజన్య

## 'మెడికవర్'లో గుండె శస్త్ర చికిత్స విజయవంతం

ప్రజాశక్తి -నెల్లూరు : నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో అత్యంత క్లిష్టమైన గుండె శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించామని మెడికవర్ కార్డియాలజీ నిపుణులు డాక్టర్ సంజీవ్ సురేష్, మత్తు డాక్టర్ డాక్టర్ వెంకట రమణ చౌదరి తెలిపారు. బుధవారం ఆస్పత్రిలో జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. కడప జిల్లాకు చెందిన 52 ఏళ్ల పుల్లారెడ్డి అనే వ్యక్తి గుండెలో మంట, ఆయాసంతో బాధపడుతూ ఛాతి నొప్పి అధికంగా ఉండటంతో కడపలోని ఓ ఆస్పత్రిలో సంప్రదించారన్నారు.. అక్కడి వైద్యులు ఈసిజి, 2డి ఎకో, తదితర గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి గుండె సంబంధిత సమస్య తీవ్రంగా ఉందని గుర్తించి యాంజియోగ్రామ్ చేయించారు. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నరాలు ఎడమవైపు 95 శాతం, కుడివైపు 100 శాతం మూసుకుపోయాయని నిర్ధారించారు. ఎమర్జెన్సీగా బైపాస్ సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. వెంటనే పుల్లారెడ్డిని నెల్లూరులోని మెడికవర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. మెడికవర్ కార్డియాలజీ నిపుణులు డాక్టర్ సంజీవ్ సురేష్, మత్తు డాక్టర్ డాక్టర్ వెంకట రమణ చౌదరి వైద్య పరీక్షల వివరాలను పరిశీలించి, బైపాస్ సర్జరీ చేయాలని, గుండెకు రెండు వైపులా రక్తాన్ని సరఫరా చేసే నరాలు దాదాపుగా మూసుకుపోయిన నేపథ్యంలో ఆపరేషన్ ఎంత క్లిష్టమైందో రోగి కుటుంబసభ్యులకు వివరించారు. దీంతో వారు ఆపరేషన్ నిర్వహణకు అంగీకరించారు. దీంతో డాక్టర్ సంజీవ్ సురేష్ వైద్య బృందం బైపాస్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. ఎంతో క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించింది. రోగి కేవలం రెండు రోజుల్లోనే పూర్తిగా కోలుకున్నారు. 5 రోజుల్లోనే పుల్లారెడ్డి పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యారన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్లు

## క్షయ నివారణపై అవగాహన

**ప్రజాశక్తి- కందుకూరు** : మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మోపాడు ఎంపి యు పి స్కూలు , మదన గోపాలపురం ఎస్ టి కాలనీ లో ఈనెల 24వ తేదీన జరిగే ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా క్షయ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మాచవరం వైద్యాధికారిణి డాక్టర్ ఎస్ డి.జువేరియా భాను మాట్లడారు. రెండు వారాలకు మించిన దగ్గు జ్వరం , ఆకలి లేకపోవడం , గడచిన మూడు నెలల కాలంలో బరువు తగ్గడం వంటి లక్షణాలు గల వారు దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి కళ్లె పరీక్ష చేయిం చుకోవాలని తెలిపారు. టి సూపర్వైజర్ కే. శ్రీమన్నారాయణ హెల్త్ సూపర్వైజర్ యం. శ్రీనివాసరావు ,ఎఎన్ఎంలు , ఎంఎల్ హెచ్ పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు .

**ప్రజాశక్తి-నెల్లూరు** :స్థానిక దర్గామిట్ట ప్రాంతంలోని సెయింట్ జోసెఫ్ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం 2024 లో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రోసీ ఎయిడ్స్ అండ్ టిబి ఆఫీసర్ డాక్టర్ ఎస్ కే ఖాదర్ వలీ పాల్గొని క్షయ వ్యాధి, చికిత్సా విధానాలపై నర్సింగ్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. టీబి రోగులకు అందుతున్న సేవల గురించి క్లుప్తంగా వివరించారు. జిల్లా క్షయ నివారణ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశంసాపత్రం అందజేత



**ప్రజాశక్తి-మర్రిపాడు** : చోరీ కేసులో నిందితులను 24గంటల్లో పట్టుకున్న ఎస్ఐ విశ్వనాథరెడ్డికి బుధవారం ఎస్‌పి తిరుమలేశ్వర్‌రెడ్డి ప్రశంసాపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ఇటీవల రాత్రి సమయంలో టీ దుకాణం నడుపుతున్న మహిళమెడలో ఉన్న బంగారు చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు వెళ్లారు. చైన్ స్నాచింగ్ కేసును సవాలుగా తీసుకొని నిందితులను 24 గంటల్లో ఎస్ఐ విశ్వనాథరెడ్డి కేసును ఛేదించి నిందితులను పట్టుకున్నారు. వారివద్ద నుండి బంగారు చైన్‌ను తీసుకొని బాధితురాలికి అందజేశారు. ఈ మేరకు ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డితో పాటు సిబ్బంది రామకృష్ణ, శ్రీనివాసులు రెడ్డిలను ఎస్‌పి అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు.

## పౌష్టికాహార పక్షోత్సవాలు

**ప్రజాశక్తి-కావలి** : కావలి ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కావలి చంద్రబాబు కాలనీలో అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్‌లో పౌష్టికాహార పక్షోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ది పూర్ పీపుల్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు చేవూరు చిన్న మాట్లాడుతూ శుభ్రమైన, సురక్షితమైన ఆహారాన్ని తీసుకోవాలని, గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం స్థానిక తల్లులు పౌష్టికాహారం తయారు చేసిన వారికి ది పూర్ పీపుల్స్, వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చేవూరు చిన్న బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు విజయలత, ఎం.సుశీల, ఇ.రమాదేవి, వి.ప్రభావతి, కె.సుకన్య, డి. దేనకుమారి, ఎం.శివలీల, తదితరులు పాల్గొన్నారు.

## కాకర్లను కలిసిన నాయకులు



**ప్రజాశక్తి-ఉదయగిరి** : మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్ విజయానికి వానర సైనికులుగా పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తామని జనసేన నాయకులు తెలిపారు. బుధవారం వింజమూరు బొమ్మరాజు చెరువు గ్రామంలోని టిడిపి కార్యాలయంలో ముఖ్యమైన జనసైనికులు కాకర్ల సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు భవిష్యత్ కార్యాచరణపై చర్చించి ఏ బాధ్యతలు అప్పగించిన చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సార్వత్రిక ఎన్నికల్లో కష్టపడి పని చేసి అభ్యర్థులను గెలిపించుకొని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని తీసుకువస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కాకర్ల సురేష్ మాట్లాడుతూ వ్యక్తిగత విషయాలను పక్కనపెట్టి పార్టీ విజయానికి తోడ్పాటు అందించాలన్నారు. పార్టీ అధికారంలోకి వస్తేనే అందరి భవిష్యత్తు బాగుంటుందని, లేకపోతే అందరి భవిష్యత్తు అంధకారం అవుతుందని, ఇప్పటికే రాష్ట్రం అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా తయారైందని, మరోసారి అవకాశం ఇస్తే ఆంధ్రను అమ్మేస్తారన్నారు. జిల్లా కార్యదర్శి అంగిరి రవీంద్ర, వింజమూరు మండల అధ్యక్షులు బండారు సత్యనారాయణ, సీతారాంపురం మండల అధ్యక్షులు పాతిశెట్టి శ్రీనివాసులు, ఉదయగిరి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, కలిగిరి ముఖ్య నాయకులు పసుపులేటి లిదాచలయ్య, వెలగోటి సురేష్, నీలి ఒబులయ్య, కోసూరి సురేష్, కొండపల్లి రమేష్, కందవరపు మహేష్, కృష్ణ, ఇమ్రాన్, పాతిశెట్టి పవన్ పాల్గొన్నారు.

## గిరిజనులకు భోజనం వితరణ

**ప్రజాశక్తి-కావలి** : సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో కావలి పట్టణం నివాసులు గణేశం.పుల్లమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు గణేశం. అజయ్‌రెడ్డి, గంగిరెడ్డి బుధవారం కావలి బుడంగుంటలోని గిరిజనులకు భోజన వితరణ చేశారు. కార్యక్రమంలో గణేశం.పుల్లమ్మ కుమారుడు గణేశం అజయరెడ్డి, మనవరాలు గణేశం.అర్జున రెడ్డిలు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, షేక్ షఫీ, షంషాద్‌బాను పాల్గొన్నారు.

## మే లో ఉచిత కుట్టు శిక్షణ

**ప్రజాశక్తి-కావలి** : గత ఆరు సంవత్సరాలుగా కావలి పట్టణంలో మహిళలకు విజయవంతంగా టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చిన శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాంద్ర చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మేలో ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటివరకు దాదాపు వెయ్యి మందికి పైగా అర్హులైన మధ్య తరగతి మహిళలకు ఉచిత కుట్టు శిక్షణలో శిక్షణ అందించి, అర్హులైన మహిళలకు రాయితీపై సుమారు 500 మందికి ఉచితంగా కుట్టు మిషన్ అందించిన శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ మరోమారు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఆసక్తి కలిగిన మహిళలు శిక్షణ కోసం పొన్నగంటి మాధవి శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ప్రైవేట్ ఫోన్ నెంబర్ 9493831209 సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు కోరుతున్నారు.

## కొండ బిట్రగుంటలో బ్రహ్మోత్సవాలు

**ప్రజాశక్తి-కావలి** : కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు విశేషమైన, నాణ్యమైన సేవలు అందించాలని ఎపిఎస్ ఆర్‌టిసి, కావలి డిపో మేనేజర్ రాఘురు శ్రీనివాసులు కోరారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో సిబ్బంది, కార్మిక నాయకులకు విధివిధాన సమావేశం నిర్వహించారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఆర్‌టిసి పరంగా అందించాల్సిన సేవలు, ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రాఘురు శ్రీనివాసులు మాట్లాడుతూ సౌకర్యవంతమైన, సురక్షితమైన సేవలు అందించేందుకు తమ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని, కావున కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు తమ బస్సులలోనే ప్రయాణించాలని, అక్రమ వాహనాల్లో ప్రయాణాన్ని నివారించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కె వి ఆర్ బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఎన్‌కె ఖాజామొహిద్దీన్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి రవిప్రకాష్, సూపర్‌వైజర్లు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## ఆలయంలో చోరీ

**ప్రజాశక్తి-వరికుంటపాడు** : మండలంలోని తూర్పు బోయమడుగుల గ్రామం బస్టాండ్ కూడలిలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఆలయంలో యథావిధిగా పూజలు చేసి ఆలయానికి తలుపులు వేసుకొని వెళ్లిన అర్చకులు బుధవారం ఉదయం వచ్చి తాళాలు తెరిచి చూడగా గేట్ తాళాలు పగలగొట్టి లోపల హుండీని పగలగొట్టి నగదును దోచుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు.

## 'అన్నదాత సుఖీభవ'

**ప్రజాశక్తి-కావలి** : "ప్రతిరోజు ఒకరికి అయినా అన్నం పెట్టాలి" అనే నినాదంతో మొదలు పెట్టిన "అన్నదాత సుఖీభవ" కార్యక్రమంలో భాగంగా బుధవారం కావలి పట్టణానికి శివారులో ఉన్న కాలేరుగుంట కాలనీలో పేదలకు ఆపద్బాంధవ సేవాట్రస్ట్ ఛైర్మన్ దామా మధుసూదన రావు ఆధ్వర్యంలో అన్నసమర్పణ చేశారు. అంబటి వేమస్వామి ఆపద్బాంధవ సేవ ట్రస్ట్ ఛైర్మన్ దామా మధుసూదన రావు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని గౌరవ అధ్యక్షుడు రామచంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయులు సేవా సేవలను అభినందించారు. టైం టు హెల్ప్ అధ్యక్షులు రమేష్, రామచంద్ర, నూరుద్దీన్ పాల్గొన్నారు.

## టిడిపిలో చేరికలు




**ప్రజాశక్తి-కావలి** : కావలి పట్టణంలోని 29వ వార్డు మాజీ వైసిపి కౌన్సిలర్ సురే మదన్‌మోహన్ రెడ్డి వైసిపిని వీడి బుధవారం టిడిపి పార్టీలో చేరారు. మదన్ మోహన్ రెడ్డితో పాటు 29వ వార్డు వైసిపి కీలక నేతలు వింతా కృష్ణారెడ్డి, శరద కూడా టిడిపిలో చేరారు. వీరికి కావలి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని వారికి హామీ ఇచ్చారు. కీలక నేతలు వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరడంతో 29వ వార్డులో వైసిపికి గట్టి షాక్ తగిలింది.

## టిడిపిలో చేరిన 'మెట్టుకూరి'

**ప్రజాశక్తి-ఉదయగిరి** : రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవి రెడ్డి సోదరుడు మెట్టుకూరి అమరలేటి రెడ్డి వైసిపిని వీడి టిడిపిలో చేరారు. మాజీ ఎంపిటిసి, మాజీ సర్పంచ్‌గా ఉన్న ఈయన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కావలి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అమరలేటి రెడ్డికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీనిచ్చారు.

## ఆలయంలో 'సుప్రభాత సేవ'



**ప్రజాశక్తి-బిట్రగుంట** : బోగోలు మండలం కొండ బిట్రగుంట గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సుప్రభాత సేవ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నెల్లూరు హరిత క్యాటరింగ్ వర్క్స్ వారి నటుకు సుబ్బారావు బంగారు కిరీటం, కర్ణ పత్రాలు, శంకు చక్రాలను శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి సమర్పించారు. దాత సమర్పించిన బంగారు కిరీటం, కర్ణ పత్రాలు, శంకు చక్రాలను కార్యనిర్వహణ అధికారి అరవ రాధాకృష్ణ, వేణుగోపాల్ రెడ్డి గుడిమెట్ల ప్రధానంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, అర్చకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు పాటించాలి

**ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్**



మాట్లాడుతున్న ఆర్‌డిఒ కె మధులత

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు రాజకీయ నాయకులతో పర్యటిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు ఆర్‌డిఒ కె.మధులత పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని ఆర్‌డిఒ ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ చేజర్ల, సంగం, ఎఎస్‌పేట మండలాల్లో ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలో ముగ్గురు వలంటీర్లు ఒక విఆర్‌ఒ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు తెలియడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వారిని సస్పెండ్ చేసినట్లు తెలియజేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 278 పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు అందులో 66 కేంద్రాలను గతంలో జరిగిన ఎన్నికల్లో సంఘటనలను దృష్టిలో ఉంచుకొని సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు ఆమె తెలిపారు. ఫారం 12 ద్వారా నియోజకవర్గంలో మొత్తం 1428 ఓట్లు డిలీట్ చేసినట్లు ఆమె తెలిపారు. నాలుగు పోలింగ్ కేంద్రాలను అదే ప్రాంతాల్లోని సౌకర్యాలున్న ఇతర భవనాల్లోకి మార్చినట్లు తెలిపారు. పాతపాడు ఓబులాయపల్లి, కంద్రిక కేంద్రాలను సమీపంలోని భవనాల్లోకి మార్పు చేశారు. అలాగే గొల్లపల్లిలోని ప్రభుత్వ భవనం బాగా లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రంలోకి మార్పు చేశామన్నారు. ఆ కేంద్రాల్లో ఎన్నికల పోలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్‌లో చిత్రీకరించినన్నట్లు తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి తొలుత జిల్లా కేంద్రాలలో మొదట శిక్షణ అనంతరం డివిజన్ కేంద్రమైన ఆత్మకూరులోని రెండవ శిక్షణ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ ఉంటున్నట్లు ఆమె తెలిపారు. మే 13వ తేదీ పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను తొలుత మున్సిపల్ పరిధిలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసి భద్రపరిచి అన్ని పిఎస్‌ల నుంచి పోలింగ్ బ్యాలెట్లు బాక్సులు చేరిన అనంతరం పటిష్టమైన బందోబస్తు మధ్య నెల్లూరులోని కనుపర్తి పాడు వద్ద ఉన్న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వివరించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో నిర్భయంగా ఓటు ప్రశాంతంగా వేయాలని ఆమె తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేం దుకు కట్టుతిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# రాఘురామిరెడ్డి సేవలు మరువలేనివి

**ప్రజాశక్తి-అల్లూరు**



రఘురామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం జిల్లా కమిటీ మాజీ సభ్యులు వాస రఘురామిరెడ్డి ఉద్యమాల్లో చేసిన కషి, పేదలకు ఆయన అందించిన సేవలు మరువలేవని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం అల్లూరులో చేపట్టిన సంతాపసభకు జిల్లా సిపిఎం నేతలు పాల్గొని సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ వాస రఘురామిరెడ్డి ఉద్యమబాటలో నడుస్తూ, తన తుదిశ్వాస వదలడం అందరి హృదయాలను కలచివేసిందన్నారు. ఆయన చివరి క్షణాల్లోనూ కూడా, అల్లూరు పార్టీ కార్యాలయంలోని కార్యకలాపాలకు సమావేశాలకు సమ్మెకు మద్దతు ప్రకటించి వారికి ధైర్యాన్నిచ్చారన్నారు. చివరి వరకూ సమాజం కోసం ఆయన జీవితాన్ని వెచ్చించారని, రైతు, సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. పోరాటమే ఊపిరిగా పనిచేశారని కొనియాడారు. రైతుల, వ్యవసాయ కార్మికుల, కార్మికుల, చేతివృత్తిదారుల నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు. రైతు సంఘం, వారిసమస్యలపై ఉద్యమించారన్నారు. ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనమిచ్చే నివాళులని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటశ్వర్లు, సిఐటియు నాయకురాలు రెహనాబేగం, మండల కార్యదర్శి పాటి భాస్కర్, టౌన్ కార్యదర్శి షైక్ రషీద్, విజయలక్ష్మి, చింతల వెంకయ్య, నేతగాని సుధాకర్, నేతగాని రమణయ్య, యారబోలు రవి, యాడ్డల చిన్నయ్య, తదితర నాయకులు పాల్గొని రఘురామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

## విద్య, ఆరోగ్యానికి పెద్దపీట



మాట్లాడుతున్న కాకర్ల సురేష్

**ప్రజాశకి-ఉదయగిరి** : నియోజకవర్గంలో ప్రతి రైతు కుటుంబాన్ని ఆదుకుని, నిరుద్యోగ నిర్మూలన ఇతర ప్రాంతాలకు వెళ్లే వలసలను అరికట్టేందుకు కంపెనీలు ఏర్పాటు చేసి విద్య, ఆరోగ్యానికి పెద్దపీట వేస్తామని నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం దుత్తలూరు మండలంలో ఏర్పాటు చేసిన టిడిపి నాయకుల పరిచయ కార్యక్రమంలో టిడిపి శాసనసభ అభ్యర్థి కాకర్ల సురేష్ ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం రాగానే నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామన్నారు. ఈ ప్రాంతంలోని కార్యకర్తలకు అభిమానులకు పూర్తిగా అండగా ఉండేందుకు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి ఒక్కరికి ఆదుకునే కార్యక్రమం చేస్తామన్నారు. వైసిపి రాక్షస పాలన నియోజకవర్గ వైసిపి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి పై విమర్శల వర్షం కురిపించారు. ఉదయగిరిని అభివృద్ధి చేసిన మేకపాటి కుటుంబం అని గొప్పలు చెప్పుకునే వాళ్లు జలదంకి మండలంలో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్న రైతులు గురించి ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో టిడిపి రావడం ఖాయమని, నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసే కార్యక్రమం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ కంభం విజయరామిరెడ్డి, దుత్తలూరు మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు.

## తండ్రిని హతమార్చిన కొడుకు

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట** : తండ్రిని కొడుకు హతమార్చిన ఘటన మంగళవారం రాత్రి మండలంలోని దేవిసేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ వీరేంద్రబాబు వివరాల మేరకు.. దేవిసేట గ్రామంలో నివాసం ఉంటున్న నెల్లూరు ప్రసాద్ అతని భార్య వెంకటరమణమ్మ మధ్య కొంతకాలంగా ఆస్తి విషయంలో తగాదాలు ఉండడంతో, భర్త ప్రసాద్ మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో భార్య వెంకటరమణమ్మతో గొడవపడి గాయపరిచాడు. అది చూసిన పెద్ద కుమారుడు మహేష్ కోపంతో తండ్రి ప్రసాద్ చేతిలో ఉన్న గడ్డపారను తీసుకుని ప్రసాద్‌పై దాడి చేశాడు. హుటాహుటిన ప్రసాద్‌ను కుటుంబ సభ్యులు స్థానికులు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## అబ్బిరెడ్డికి మేకపాటి పరామర్శ

**ప్రజాశక్తి-సీతారామపురం** : సీతారామపురం మండలం లోని పోలం గిరి పల్లి గ్రామానికి చెందిన కసవర్తి అబ్బిరెడ్డి భార్య కొండమ్మ మతి చెందడంతో బుధవారం ఉదయం పొలంగిరిపల్లిలో అబ్బిరెడ్డి ఇంటి వద్ద కొండమ్మ మృతదేహానికి ఉదయగిరి నియోజకవర్గ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి, సీతారామపురం మాజీ జెడ్‌పిటిసి దుగ్గిరెడ్డి గురవారెడ్డి నివాళులర్పించారు. అనంతరం అబ్బిరెడ్డిని ఓదార్చి ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారివెంట రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పి సి అల్లూరు రాజు, గండిపాలెం మాజీ ఎంపిటిసి పాముల రమణయ్య, దయాకర్‌రెడ్డి, నియోజకవర్గం వైసిపి యువజన విభాగ ప్రధాన కార్యదర్శి కల్లూరి రాజారెడ్డి, మాజీ సర్పంచ్ రేనాటి సుధాకర్ నాయుడు, బెరి భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సెక్టార్ అధికారులదే తుది నిర్ణయం

**ప్రజాశక్తి-ఉదయగిరి**



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

సార్వత్రిక ఎన్నికల్లో సెక్టార్ అధికారులు కీలకమని వారి నిర్ణయమే తుది నిర్ణయం అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సెక్టర్ అధికారులు బిఎల్‌ఒలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సెక్టార్ అధికారుల బిఎల్‌ఒల విధి విధానా లపై అవగాహన కల్పిస్తున్నామని, జరగనున్న ఎన్నికల్లో సిబ్బంది సెక్టార్ అధికారుల సమన్వయం తో బిఎల్‌ఒలు తమ విధులను నిర్వహించాలన్నారు. ఓ సెక్టార్ అధికారికి 7 నుంచి 10 వరకు పోలింగ్ స్టేషన్‌లు ఉంటా యని, ఆ పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన బిఎల్‌ఒలు సెక్టార్ అధికారులకు సహరించి వారి నిర్ణయాన్ని తుది నిర్ణయంగా తీసుకొని ఎన్నికల విధి నిర్వహణలో విధులను స్వచ్ఛందం గా నిర్వహించి ఎన్నికల సజావుగా జరిగేందుకు సిబ్బందికి సహకరించాలన్నారు. వాటర్ స్లిప్స్ కూడా సెక్టార్ పరిధి నుండి పంపిణీ చేయాల్సి ఉంటుందని రోజుకి ఎన్ని పంపిణీ చేశారు. వాటి వివరాలు సెక్టార్ అధికారులు సేకరించాల్సి ఉంటుందని అందుకు బిఎల్‌ఒలు సమన్వయంతో ఎప్పటికప్పుడు సమస్యలను సంబంధించిన సెక్టార్ అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా రాజకీయ ప్రచారాలకు దూరంగా ఉండాలని ఎన్నికల నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించే వారిపై క్రిమినల్ చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయక రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు, అధికారులు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

## టవర్ నిర్మాణం ఆపాలని వినతి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**



వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

తమ ప్రాంతంలో సెల్‌ఫోన్ టవర్ నిర్మించొద్దంటూ, వాటి వల్ల రేడియేషన్ వచ్చి 18వ వార్డు ప్రజలు అనారోగ్య పాలవుతారని సెల్‌ఫోన్ టవర్ నిర్మాణం ఆపాలని బుధవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లుల్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 18వ వార్డు ప్రజలు మాట్లాడుతూ ఆత్మకూరు పురపాలక పరిధిలోని 18వ వార్డు ఆర్‌డిఒ కార్యాలయానికి వెళ్లే సమీపంలో ఉన్నగా నివాసం ఉంటున్న షేక్ రహమతుల్లా తన ఇంటిపై సెల్‌ఫోన్ టవర్ నిర్మాణం చేయడానికి సెల్‌ఫోన్ టవర్ వారికి అనుమతి ఇచ్చి ఉన్నారని తెలిపారు. టవర్ నిర్మించడానికి పనులు ప్రారంభించారన్నారు. సెల్‌ఫోన్ టవర్ వల్ల రేడియేషన్ ద్వారా స్థానికంగా ఉండే తమ కుటుంబీకులకు చిన్నపిల్లలకు, వృద్ధులకు, గర్భిణులకు కేన్సర్ చర్మ వ్యాధులు, బ్రెయిన్ ట్యూమర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. కాబట్టి తమ ప్రాంతంలో సెల్ టవర్ నిర్మాణం జరగకుండా ఆపాలని ప్రజలు కమిషనర్‌ను కోరారు. కమిషనర్ మాట్లాడుతూ ఎవరి ఇంటివద్ద అయితే నిర్మాణం చేపడుతున్నారో వారి వద్దకు వెళ్లి మాట్లాడి లేనిపక్షంలో ధర్నాకైనా దిగి టవర్ నిర్మాణం చేపట్టకుండా మీరే ఆపుకోవాలని ప్రజలకు వివరించారు. అది తమ వల్ల అయితే ఏమి కాదని, తాను కూడా పరిశీలించానని వారికి తెలిపారు.

## వలంటీర్‌పై చర్యలు

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట**

మండలంలోని చౌట భీమవరం గ్రామంలో మంగళవారం జరిగిన వైసిపి ఎంఎల్ఎ ప్రస్తుత పార్టీ అభ్యర్థి అయిన మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారని తేలడంతో నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్‌డిఒ మధులత తెలిపారు. ఎన్నికల్లో అధికారులు ఎవరైనా పాల్గొనరాదని అలా పాల్గొన్నట్లు ఆధారాలు ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు చేపడతామన్నారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు కోడ్ అమలులో ఉంటుందని ఈ సమయంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీల ప్రమేయం లేకుండా నిర్వహించాలన్నారు. ఫొటోలు ఫ్లెక్సీలు పాల్గొనడం లాంటి కార్యక్రమాలు అధికారులు చేపట్టరాదన్నారు.

## అరుణాచలంకు ప్రత్యేక సర్వీస్

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

మార్చి 25 తేదీ పౌర్ణమి సందర్భంగా (కార్తీక సోమవారం) మార్చి 24వ, తేదీ ఉదయం 8 గంటలకు ఆత్మకూరు నుండి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు (సర్వీస్ నెం.94320)ను ఏర్పాటు చేసినట్టు ఆత్మకూరు డిపో మేనేజర్ కరీమున్నిసా తెలిపారు. ఆన్లైన్ ద్వారా రిజర్వేషన్స్ సౌకర్యం కూడా ఉందని తెలిపారు. టికెట్ ధర రాను పోను రూ.1400లుగా నిర్ణయించినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. సందర్శించు ప్రదేశాలు కాణిపాకం, సిరిపురం గోల్డెన్ టెంపుల్, అరుణా చలం, గిరిప్రదర్శనం పూర్తి సమాచారం కోసం డిఎం ఆత్మకూరు 9959225645, సిఐ ఆత్మకూరు 9966009395, డివి సుబ్బయ్య కండక్టర్ 8555 929504 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

## ప్రత్యేక పూజలు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

ఆత్మకూరు పట్టణంలోని ఆత్మకూరు 13 వ వార్డు అంబేద్కర్ నగర్‌లోని రామాలయం మొదటి వార్షికోత్సవంలో భాగంగా బుధవారం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతర భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వార్షికోత్సవ సంబరాలలో శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్‌రెడ్డి సౌజన్యంతో అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపారు. సందర్భంగా ఆలయ కమిటీ నిత్య అన్నదాత కంచి పరమేశ్వరరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుముల సుధాకర్ రెడ్డి, రాంపల్లి ప్రసాద్ రెడ్డి, దొడ్డవరపు నారాయణ, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

## దర్గాలో ప్రార్థనలు

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట**

రానున్న సార్వత్రిక ఎన్నికలలో వైసిపి విజయం సాధించాలని పలువురు ముస్లిం నాయకులు నాగూర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు ఎస్‌పేటకు చెందిన మైనారిటీ నాయకుడు సయ్యద్ కాలేషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఐదు యేళ్ల నుంచి పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందించిందన్నారు.

## 'అనంతసాగరం'లో విజయీభవ యాత్ర



సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి

**ప్రజాశక్తి-అనంతసాగరం** : మండలంలోని వడ్డీపాళెం, కొత్తపల్లి, కాకూరువారిపల్లి, వెంగమ నాయుడుపల్లి, కచిరిదేవరాయపల్లి గ్రామాల్లో బుధవారం ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఎంఎల్ఎ మేకపాటికి స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులు ఇస్తూ పూలు చల్లుతూ ఆప్యాయంగా ఎంఎల్ఎకు స్వాగతం పలికారు. ప్రజలతో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమాభివృద్ధిలో రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి గడపలోనూ సంపూర్ణ ఆరోగ్య మందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకోవాలనే సమున్నత లక్ష్యంతో ముందుకు సాగారని తెలిపారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలన్నింటినీ మిగిలిన రాష్ట్రాల వారు అమలు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారని, రాష్ట్రంలోని ప్రతిపక్షాలు మాత్రం దుష్ప్రచారాలు చేస్తూ సంక్షేమ పథకాలతో ఆర్థికంగా నష్టపోతారని చెప్పారని, అయితే ప్రజల్లోకి వారు వచ్చిన తరువాత జగనన్న పథకాల గురించి పూర్తిగా తెలుసుకుని తమ తొలి మేనిఫెస్టో అంటూ ఇవే పథకాలను ప్రజల ముందుకు తీసుకొచ్చారని, ఇది ప్రజలంతా గమనించాలన్నారు. ప్రజలకు చేసిన మంచిని వివరించి ఓట్లు అడిగే ధైర్యం ఒక్క జగనన్నకే ఉందని, హామీలన్నీ మరచి ప్రజలను ఓటు బ్యాంకుగా మాత్రమే భావించే ఇవేమి అర్థం కావని, రానున్న 2024 ఎన్నికల్లో మళ్లీ వారికి బుద్ధి చెప్పాలన్నారు. రెవెన్యూ సంస్కరణలను కలెక్టర్‌తో జరిపిన ప్రత్యేక సమీక్షలతో 676మంది రైతులకు సంబంధించిన 565 ఎకరాల్లో భూ సమస్యలకు పరిష్కారం చూపినట్లు వివరించారు. గత ప్రభుత్వాల పాలనలో నియోజకవర్గంలో ఇంతటి అభివృద్ధి, సంక్షేమం ఏ మేరకు అందజేశారో.. ప్రజలకు వివరించి ఓట్లు అడిగేందుకు రావాలని, ప్రజలకు కూడా ప్రశ్నలడిగేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే జగనన్న సారథ్యంలో ప్రజలందరూ మెచ్చేలా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సంపూర్ణమ్మ, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ బ్యాగ్స్ నివారణపై అవగాహన

**ప్రజాశక్తి-బిట్రగుంట** : బోగోలు మండలం కడనూతుల గ్రామంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గౌరవరం గ్రామంలో స్పెషల్ క్యాంప్‌లో భాగంగా మూడవ రోజు అవేర్నెస్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ప్లాస్టిక్ బ్యాగ్ నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి వి ఎన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాధిక, అంగన్‌వాడీ టీచర్ మల్లేశ్వరి, సచివాలయం సిబ్బంది, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఏ కిరణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కోడ్ ఆఫ్ కాంటాక్ట్‌కు సహకరించాలి



**ప్రజాశక్తి-ఉదయగిరి** : మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్‌ను ఉల్లంఘిస్తే క్రమశిక్షణ రాహిత్య చర్యలు తప్పవని ఎన్నికల రిటైనింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టే 2024 ఎన్నికలు మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ నేటికీ అమల్లో ఉందని ప్రభుత్వ ఉద్యోగులు వాలంటరీలు ఈ కోడ్‌ను ఉల్లంఘిస్తే క్రమశిక్షణ రాహిత్య చర్యలు తప్పవని అటువంటి వారిపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియోజకవర్గంలో 323 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అందులో 23 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఓటర్లు చేర్పులు తొలగింపులకు సమయం నామినేషన్ చివరి రోజు వరకు తీసుకోబడతాయని, అవసరమైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృద్ధులు ఇంటి వద్ద ఓట్లు వేసేందుకు 85 సంవత్సరాలు వయస్సు కలిగి ఉండాలన్నారు. వికలాంగులు సదరం సర్టిఫికెట్ కలిగి 100శాతం వికలాంతత్వం కలిగి ఉండాలని అలాంటి వారికి ఈ అవకాశం ఉపయోగ పడుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల కోడ్‌కు సజావుగా జరిగేందుకు సహరించాలని రాజకీయ ప్రచారాలకు పాల్గొనరాదని పాల్గొనే వారిపై వెంటనే క్రమశిక్షణ రాహిత్య చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే వరికుంటపాడు మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లను ముగ్గురు, ఒక ఎమ్‌డి ఆపరేటర్‌పై ఎన్నికల నిబంధన ఉల్లంఘనపై వేటు వేశామన్నారు.

## తోపుడు బండి అందజేత

**ప్రజాశక్తి-కావలి** : 'అబైడింగ్ హోప్ ట్రస్ట్' సంస్థ సహకారంతో, స్థానిక "సార్డ్స్" స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేశ్వరీ అనే ఎయిడ్స్ వ్యాధి బాధితురాలికి ఉపాధి కల్పించే ఆశయంతో తోపుడు బండిని వితరణంగా అందజేశారు. కాగా రాజేశ్వరి తల్లిదండ్రులు ఎయిడ్స్ వ్యాధితో చనిపోయారు. వారి కుమార్తె రాజేశ్వరీ ముసునూరులో చిన్న ఇంటిలో ఒంటరిగా నివసిస్తుంది. ఆమెకు ఉపాధి కోసం సార్డ్స్ సంస్థ ద్వారా సమాజంలో జీవించేందుకు సహాయం చేస్తున్నారు. అబైడింగ్ హెూప్ ట్రస్ట్ నిర్వాహకులు ఎం.టైటస్ నిర్మల్ కుమార్, ఆమెకు ప్రతినెలా న్యూట్రీషియన్ అందజేస్తున్నారు. కార్యక్రమంలో సార్డ్స్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ జె.రూత్ బేనోమి, క్రాంతి కుమార్, ఎ హెచ్ టి, సార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## 23న నారా భువనేశ్వరి రాక

**ప్రజాశక్తి-వెంకటాచలం:** మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 23వ తేదీ శనివారం మధ్యాహ్నం వెంకటాచలం మండలానికి రానున్నారని టీడీపీ మండల అధ్యక్షులు గుమ్మడి రాజా యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల చంద్రబాబును అక్రమ అరెస్ట్ చేసిన నేపథ్యంలో మనస్థాపానికి గురై మండలంలోని పుంజులూరుపాడు, కురిచెర్లపాడు గ్రామాలకు చెందిన ఇద్దరు టీడీపీ అభిమానులు మృతి చెందడంతో విషయాన్ని మాజీ మంత్రివర్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి టిడిపి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల ఆ రెండు కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ తరఫున మూడు లక్షల రూపాయల చొప్పున చెక్కులను ఆయా కుటుంబాలకు సోమిరెడ్డి స్వయంగా అందజేశారు. దీంతో ఆ రెండు కుటుంబాలను సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నారా భువనేశ్వరి వారి ఇళ్లకు చేరుకొని పరామర్శిం చనున్నారు.



ప్రచారం చేస్తున్న దృశ్యం

## టిడిపి ఇంటింటి ప్రచారం

**ప్రజాశక్తి-నెల్లూరు సిటీ:** నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఆమంచర్ల గ్రామంలో ఇంటింటికి కోటంరెడ్డి కుటుంబం 2వ విడత ప్రచారాన్ని బుధవారం మొదలుపెట్టారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సతీమణి కోటంరెడ్డి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని, చంద్రబాబు నాయుడుకి, నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కి, నెల్లూరు రూరల్ తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కి మద్దతు ఇవ్వాలని, కోరారు.



కవాతు చేస్తున్న దృశ్యం

## గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

**ప్రజాశక్తి-వెంకటాచలం:** మండలంలోని అనికేపల్లి, గుడ్లూరు వారిపాలెం, నిడిగుంటపాలెం గ్రామాలలో బుధవారం సిఐ అంకమ్మరావు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ భద్రత బలగాలు కవాతు నిర్వహించారు. సిఐ అంక మరావు మాట్లాడుతూ ఎన్నికల నియ మావళి అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఎన్నికల నిబంధనలను పాటిం చాలన్నారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్ర మంలో ఎస్ఐ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించండి

**ప్రజాశక్తి-నెల్లూరు సిటీ**

నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సౌకర్యాలను మరోసారి తనిఖీ చేసి ,పాఠశాలలకు సంబందించిన పోలింగ్ కేంద్రాల పేరు బోర్డులు, పోలింగ్ కేంద్రం క్రమ సంఖ్య, ఓటర్లకు బహిరంగంగా కనిపించేలా గోడలపై పెయింటింగ్ చేసి సిద్ధం చేయాలని రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు, జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ సూచనల మేరకు నెల్లూరు సిటీ పరిధిలో జరగనున్న ఎన్నికల నిర్వహణపై కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సెక్టార్ అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రస్తుతం ఉన్న ఫర్నిచర్, అవసరమైన ఫర్నిచర్




మాట్లాడుతున్న కమిషనర్

వివరాలను సమగ్ర నివేదిక ద్వారా తెలియజేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వయో వృద్ధుల కోసం ప్రత్యేక వీల్ చైర్ రాంప్, సిసి కెమెరాల ఏర్పాటు చర్యలను వేగవంతం చేయాలన్నారు. వేసవి వాతావరణానికి అనుకూలంగా పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, మంచినీటి వసతి, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు.ఎన్నికల విధులను ప్రతిఒక్కరూ నిబద్ధతతో నిర్వర్తించాలని, బాధ్యత ఎరిగి ప్రవర్తిం చాలని సూచించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సిబ్బందికి వర్తించే ప్రత్యేక అధికారాలను సద్వినియోగం చేసుకోవా లన్నారు. సామాన్య ప్రజానీకానికి ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించి, ఎన్నికల కోడ్ అమల్లో వారికి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షిం చాలన్నారు.

## మేలుజాతి పశువుల ఉత్పత్తిపై అవగాహన

**ప్రజాశక్తి-కోవూరు**

పాడి రైతుల్లో మేలుజాతి పశువుల ఉత్పత్తిపై మరింత అవగాహన కల్పించేలా పశు సంవర్ధక శాఖ సహాయకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. కోవూరులోని శాంతినగర్లోని పశు వైద్యశాలలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పశు సంవర్ధక శాఖ సహాయకులకు ఈ కేంద్రానికి వచ్చే పశువులకు ఎద్దులకు ఏ విధమైన చికిత్స చేయాలి.. వ్యాధులను ఏ విధంగా గుర్తించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ శిక్షణలో చెప్పే అంశాలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవడమే కాకుండా వాటిని వారి వారి పరిధిలోని గ్రామాల్లో అమలు పరిచేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోవూరు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పరిధిలోని పశు సహాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలి

**ప్రజాశక్తి-కోవూరు**

కోవూరు నియోజకవర్గంలో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేసేలా ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోవూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ అన్నారు. స్థానిక ఇఆర్ఒ కార్యాలయంలో బుధవారం ఆయన ఫ్లయింగ్ స్క్వాడ్, సి-విజిల్,



మాట్లాడుతున్న జెసి మాధవన్

తదితర ఎన్నికల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఇచ్చిన సూచనలను విధులు నిర్వహించే అధికారి తప్పక అవగాహన చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల కోడ్ అమలు వచ్చిన నేపథ్యంలో దానికి అనుగుణంగా చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై వారు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవా లన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాలకు సంబంధించిన తహాశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన టెక్నాలజీపై దృష్టి సారించాలి

**ప్రజాశక్తి-కోవూరు**

ఇంజినీరింగ్ విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పద్ధతులపై మరింత అవగాహన చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సీఎస్ఈ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వాల్యు యాడెడ్ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను మరింత వెలికి తీసేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను తమ కళాశాలలో నిర్వ హిస్తున్నామన్నారు. విద్యార్థులు కూడా మారుతున్న కాలానికి అనుగుణంగా కోర్సులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రోగ్రామింగ్ ఇన్ సీప్లస్ ప్లస్ వంటి కోర్సులతో భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఆర్. రజని తెలిపారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా ఎం. నాగేంద్ర, కన్వీనర్ డాక్టర్ ఆర్. రజని సమన్వయకర్తగా ఎం. శివనాగమణి వ్యవహరించారు.

## పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

**ప్రజాశక్తి-కోవూరు**

ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనాసుజన అన్నారు. మండలంలోని పాటూరు పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం పూర్తిస్థాయిలో గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకోవడమే కాకుండా ఆకుకూరలు, పాలు, గుడ్లు తదితర వాటిపై దృష్టి పెట్టి వాటిని సమపాళ్లలో తీసుకోవాలన్నారు. అదేవిధంగా తక్కువ ఖర్చుతో తయారు చేసే పౌష్టికాహారాన్ని కూడా వారు ఉపయోగించుకోవాలన్నారు. గర్భిణుల్లోగానీ, బాలింతల్లో గానీ రక్తహీనత ఉంటే అటువంటి వారి సమాచారాన్ని తప్పనిసరిగా వైద్యాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ అరుణ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా "పది" పరీక్షలు..!

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు:** మండలంలో ఈ నెల 18వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ఎటువంటి మాస్ కాపీయింగ్, అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నట్లు మండల విద్యాశాఖ అధికారి సన్నపురెడ్డి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం ఇంగ్లీష్ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 529 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 11 మంది హాజరు కానట్లు ఎంఇఒ తెలిపారు. మండలంలోని తోటపల్లిగూడూరు, చెన్నపల్లిపాలెం, చిన్నచెరుకూరులలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు పటిష్ట బం దోబస్తు మధ్య ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎంఎల్ఎ కోటంరెడ్డి

## టిడిపిలో పలువురు చేరిక

**ప్రజాశక్తి-నెల్లూరు సిటీ:** టిడిపికి రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని నెల్లూరు రూరల్ లో వైసీపీ ఖాళీ కావడం తథ్యమని ఆ పార్టీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పుటూరు సర్పంచ్ అంబటి వెంకట సుబ్బా రెడ్డి, ఉపసర్పంచ్ బెల్లంకొండ వెంకట రత్నం, నలుగురు వార్డ్ మెంబర్లు, సుధీర్ రెడ్డి వైసీపీకి రాజీనామా చేసి నెల్లూరు రూరల్ టిడిపి కార్యాలయంలోటీడీపీ ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి,కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సమక్షంలో బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అందరం కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే వారంరోజుల్లో నెల్లూరు రూరల్‌లో వైసిపి కీలక నేతలు నెల్లూరు రూరల్ టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

## సబ్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి-వెంకటాచలం:** మండలంలోని కసుమూరు విద్యుత్ సబ్ స్టేషన్‌ను బుధవారం విద్యుత్ శాఖ డైరెక్టర్ ఎన్.వి.ఎస్ సుబ్బరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్‌లో లోడ్స్‌ను చెక్ చేసి, లూస్ కాంటాక్ట్స్ ఏమైనా ఉన్నాయోమోనని చెక్ చేశారు. కెపాసిటర్ బ్యాంక్స్, చార్జెస్ లు పనిచేస్తున్నాయో లేదో చూశారు. కసుమురు, ఇండస్ట్రియల్ క్వారీ, కురిచెర్లపాడు, పొలిచెర్లపాడు, కందలపాడు అగ్రికల్చర్ లోడ్స్ ఎంత వస్తున్నాయో చెక్ చేశారు. అనంతరం పలు రికార్డులు, లాగ్ బుక్, డ్యూటీ హ్యాండింగ్ ఓవర్ బుక్, తదితర రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ టి తిరుపతయ్య పాల్గొన్నారు.

## ప్రముఖ విద్యావేత్త రత్నం మృతి

**ప్రజాశక్తి-నెల్లూరు సిటీ:** ప్రముఖ విద్యావేత్త రత్నం విద్యా సంస్థల అధినేత కె.వి రత్నం బుధవారం మృతి చెందారు. నెల్లూరు నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ దంపతులు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కె.వి రత్నం మృతి విద్యా రంగానికి తీరని లోటన్నారు.ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించిన ఘనత కె.వి రత్నంకు దక్కుతుందన్నారు.ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు.

## అంగరంగ వైభవంగా ఉత్సవాలు

**ప్రజాశక్తి-కోవూరు :** కోవూరులోని కొత్తూరు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో బుధవారం మహాకుంభాభిషేక మహాసంప్రోక్షణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. ఈ మహోత్స వాలను పురస్కరించుకుని మహా కుంభప్రోక్షణ తదితర కార్యక్రమాలను రుత్వికులు సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బలి పీఠంల ఊరేగింపులో వంశ పారంపర్య ధర్మకర్తలు కాటంరెడ్డి అనీషమ్మ, నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి, అన్నపూర్ణమ్మ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహా పూర్ణాహుతి కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, అధిక సంఖ్యలో జిల్లా నలుమూలల నుంచి భక్తులు పాల్గొన్నారు.